నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 21 మే 2024 | HYDERABAD


## జేఎన్‌టీయూలో సైన్స్ ల్యాబ్

బాలానగర్ , మే 20 : అంతర్జాతీయ స్థాయిలో జేఎన్‌టీయూ ల్యాబ్‌ను రూపొందించనున్నట్లు వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రూ. 2 కోట్ల నిధులతో చేపట్టిన ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ జేఎన్‌టీయూలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో డైరెక్టర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ శశికళ ఆధునిక పరికరాలతో రూ. 2 కోట్లతో సైన్స్ ల్యాబ్‌ను సిద్ధం చేశారని తెలిపారు. సైన్స్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జేఎన్‌టీయూలో సైన్స్ ల్యాబ్‌ను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, వర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి

## అవయవదానం.. ఐదుగురికి కొత్త జీవితం

మన్సూరాబాద్/ఖైరతాబాద్: తాను మరణిస్తూ..మరో ఐదుగురికి కొత్త జీవితాన్ని అందించిందో మహిళ. సూర్యాపేట జిల్లా, మోతె మండలం, తుమ్మగూడెంకు చెందిన ఉబ్బిపెల్లి ఉమ (33) భర్త మధుసూదన్‌తో కలిసి నగరంలో ఉంటున్నారు. ఈ నెల 16న రాత్రి ఎన్టీఆర్‌నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఉమకు తీవ్రగాయాలవ్వగా, చికిత్స కోసం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించారు. చికిత్స అందించిన వైద్యులు.. ఈ నెల 18న ఆమె బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు..అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఉమ నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు. అవయదానానికి ముందుకొచ్చిన కుటుంబసభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.



ఉబ్బిపెల్లి ఉమ (ఫైల్)





### ఇటు మురికి...

ఇది ఉప్పల్ నల్లచెరువు. ఎంత కాలుష్యంగా మారిందో ఈ చిత్రమే చెబుతున్నది. చుట్టుపక్కల నుంచి రసాయన, కాలుష్యనీరు చెరువులో కలిసి.. ఇలా నురుగు కక్కుతున్నది. ఆ ప్రాంతం నుంచి వెళ్లే వారి ముక్కుపుటాలు దుర్వాసనతో అదిరిపోతున్నది.

### అటు చెత్త

పద్మారావునగర్ రోడ్‌లోని గాంధీ వైద్యశాల వద్ద దుస్థితి ఇది. ఆ రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించకపోవడంతో పరిసరాలు దుర్గంధంగా మారాయి. ఈ రహదారి మీదుగా వెళ్తున్న వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



### టీఎస్ స్థానంలో టీజీ..

మేడ్చల్, మే 20 (నమస్తే తెలంగాణ): టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు తక్షణమే ఉత్తర్వులను అమలు చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్ బదులుగా టీజీని వాడాలని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. లెటర్ హెడ్స్ రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు, ఆన్‌లైన్ జీవోలు ఇతర అధికారిక వెబ్ సైట్లు ఆన్‌లైన్ జీవోల్లో టీజీగా మార్చాలన్నారు.

### కదిలిన బల్దియా

శిథిల భవనాల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

రెండ్రోజుల్లో సమగ్ర నివేదిక

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, మే 20, (నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు శిథిల భవనాలపై బల్దియా దృష్టిపెట్టింది. పురాతన భవనాల విషయంలో జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ ఆదివారం 'నమస్తే'లో ప్రచురించిన కథనానికి స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు.. ప్రమాదకర భవనాలను గుర్తించి , సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసేందుకు సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రెండు రోజుల్లో 30 సర్కిళ్లలో కూలేందుకు సిద్ధంగా ఉన్న పురాతన భవనాలకు సంబంధించి నివేదికను కమిషనర్ అందజేయనున్నారు. వానకాల విపత్తుల నివారణలో భాగంగా శిథిల భవనాలను గుర్తించడం, పురాతన భవనాల పటిష్టత , భద్రతపై ఇంజినీరింగ్ విభాగాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకరమైన భవనాలను కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం సర్వే జరుపుతున్నారు. శిథిల, ప్రమాదకరమైన భవనాల్లో ఉన్న నివాసితులను గుర్తించి..వారిని అక్కడిని నుంచి ఖాళీ చేయడానికి చర్యలు చేపట్టనున్నారు. వచ్చే నెల మొదటి వారంలో వర్షాకాలం మొదలవ్వనున్న నేపథ్యంలో పాత భవనాల రూపంలో ముప్పు రాకుండా భవన యజమానులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న భవనాలను ఇప్పటికే గుర్తించిన అధికారులు.. నోటీసులు జారీ చేస్తున్నారు.



# ఆలస్యంగా మేల్కొన్నారు!

## వర్షాలు కురుస్తున్న సమయంలో చెట్ల కొమ్మల తొలగింపు

ఎప్పుడో చేయాల్సిన పనిని.. చాలా ఆలస్యంగా మొదలు పెట్టింది విద్యుత్ శాఖ. వర్షాకాలం వస్తుందంటే చాలు.. గాలి, దుమారంతో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడితే.. ఒక్కసారిగా సరఫరా నిలిచిపోతున్నది. ఇలాంటి పరిస్థితి ఎదురుకావద్దంటే ముందస్తు ప్రణాళికతో కార్యాచరణ చేపట్టాల్సిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చాలా ఆలస్యంగా మేల్కొంది. ఒకవైపు వర్షాలు కురుస్తుంటే... మరో వైపు చెట్ల కొమ్మల నరికివేతకు కార్యాచరణ ప్రకటించింది. గత వారం రోజులుగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఎదురవుతున్నాయి. కొన్ని చోట్ల చెట్లు, చాలా ప్రాంతాల్లో కొమ్మలు వర్షంతో పాటు వచ్చే గాలి దుమారానికి విద్యుత్ తీగలపై పడుతున్నాయి. దీంతో ఒక్కసారిగా సరఫరా నిలిచిపోతున్నది. దీంతో గంటల తరబడి శ్రమించి.. సరఫరాను పునరుద్ధరిస్తున్నది విద్యుత్ శాఖ. కాగా, ఇలాంటి పరిస్థితి రాకుండా గతంలో వర్షాకాలానికి రెండు, మూడు నెలల ముందే సర్కిళ్ల వారీగా ఉదయం, మధ్యాహ్నం వేళల్లో మరమ్మతు నిర్వహణ పేరిట పనులు చేపట్టేవారు. – సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ)

**నిర్ణీత గడువులో పనులు పూర్తి కావడం కష్టమే**

**చినుకు పడినా.. కోతలు తప్పవంటున్న సిబ్బంది**



### రెండు నెలలకుపైగా ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో..

గ్రేటర్ ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను పెంచుకుంటూ వెళ్లాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉంటుంది. ఈ వేసవిలో కొత్త విద్యుత్ నెట్ వర్క్‌కు సంబంధించి పనులను కాంట్రాక్టర్లు చేపట్టిన తర్వాత వాటిని అనుసంధానం చేసేందుకు ఇవ్వాల్సిన లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) అనుమతులను పూర్తిగా నిషేధించారు. దీంతో 2 నెలలకు పైగా ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిపి వేసి.. కొత్త నెట్ వర్క్ అనుసంధానం చేయాల్సి ఉంది. అదే సమయంలో చెట్ల కొమ్మల నరికివేత కోసం మరమ్మతులు, నిర్వహణ పేరిట విద్యుత్‌ను ప్రత్యేక సమయాల్లో నిలిపివేయాల్సి ఉంటుంది. దీంతో వర్షాకాలం ప్రారంభం నుంచే విద్యుత్ కోతలు తప్పనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### 9 సర్కిళ్ల పరిధిలో..

గ్రేటర్ పరిధిలో ఉన్న మొత్తం 9 సర్కిళ్ల పరిధిలో కోర్ సిటీతో పాటు శివారు ప్రాంతాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉంటుందని, దీనికి ఎక్కువ సమయం పడుతుందని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇదిలాఉంటే కేసీఆర్ ప్రభుత్వంలో ముందస్తు కార్యాచరణ ప్రకారం.. విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనులు నిరంతరంగా చేపడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇచ్చేవారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా విషయంలో ఉన్నతాధికారుల నిర్ణయాలతో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. జూన్ మొదటి వారం నుంచే వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచించింది. దీంతో కేవలం 10 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఇంత తక్కువ సమయంలోనే మొత్తం 9 సర్కిళ్ల పరిధిలో చెట్ల కొమ్మ తొలగింపు ప్రక్రియ, కొత్త విద్యుత్ లైన్ల అనుసంధానం ఒకే సమయంలో రెండు రకాల పనులు చేయాలంటే..కోతలు విధించాల్సిన పరిస్థితి ఉంటుందని విద్యుత్ శాఖలో ఆందోళన మొదలైంది. కరెంటు సరఫరాలో కోతలు పెడితేనే ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని, లేదంటే తరచూ అంతరాయాలు ఉండే అవకాశం ఉన్నదని నిపుణులు పేర్కొంటున్నారు.





నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

# 'వీ వాంట్ పేమెంట్స్'..

కొనసాగుతున్న కాంట్రాక్టర్ల పోరుబాట

పెండింగ్ బిల్లులు రూ.**1350** కోట్లు

₹

మే నెలకు సంబంధించి.. రూ. **57** కోట్లు విడుదల

## మొత్తం చెల్లించే వరకు పనులు చేపట్టం.. కాంట్రాక్టర్ల స్పష్టీకరణ

సిటీబ్యూరో, మే 20, (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్ల పోరుబాట కొనసాగుతున్నది. రూ.1350 కోట్ల మేర పెండింగ్ బకాయిలు చెల్లించే వరకు జీహెచ్‌ఎంసీకి సంబంధించిన మెయింటెనెన్స్ పనులు చేపట్టబోమంటూ.. ఈ నెల 18 నుంచి కాంట్రాక్టర్లంతా సమ్మెలోకి వెళ్లి నిరసన తెలుపుతున్నారు. తొలిరోజు బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యాలయం ముందు నిరసన చేపట్టగా...సోమవారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో కాంట్రాక్టర్లు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. 'వీ వాంట్ పేమెంట్స్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థిక సుడిగుండంలో చిక్కుకుని బతకలేని పరిస్థితిలో ఉన్నామంటూ.. కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువులకు డబ్బులు లేక, వర్కర్లకు ఈపీఎఫ్, బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ఆర్థిక బాధలతో సడెన్ స్ట్రోక్‌లకు గురై ప్రాణాలు పోతున్న పరిస్థితులు వచ్చాయని అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

### రూ. 57 కోట్లు విడుదల

మూడు రోజులుగా కాంట్రాక్టర్లు రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు నిలిపివేసి బంద్‌లోకి వెళ్లారు. అసలే వర్షాకాలం..అపై కాంట్రాక్టర్లు బంద్‌లోకి వెళ్లడంలో అధికారులు ఆలస్యంగానైనా అలర్ట్ అయ్యారు. ఈ మేరకు కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో ఫైనాన్స్ విభాగం అధికారులు చర్చలు జరిపారు. మే నెలకు సంబంధించిన రూ. 57 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీనిపై కాంట్రాక్టర్లు మాత్రం పెదవి విరుస్తున్నారు. పెండింగ్ బిల్లులు భారీగా ఉంటే నామమాత్రంగా డబ్బులు కేటాయించి పనుల్లోకి రావాలని అనడం ఎంత వరకు సమంజసమని, బకాయిలు మొత్తం విడుదల చేసే వరకు పనులు చేపట్టబోమని, నిరసనను కొనసాగిస్తామని ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

### అత్యవసర పనుల్లోకి రాకుంటే చర్యలు

మాన్‌సూన్ ముందస్తు చర్యల్లో భాగంగా అత్యవసర పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, పనుల్లో జాప్యం చేస్తే సంబంధిత ఐఆర్టీ కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సోమవారం బల్దియా మెమో జారీ చేసింది. టెండర్ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని, ముందస్తు ఒప్పందం మేరకు బిల్లుల చెల్లింపులు జీహెచ్‌ఎంసీ సకాలంలో జరుపుతుందని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించింది. కాంట్రాక్టర్లు మాత్రం బకాయిలు చెల్లించకుంటే అవసరమైతే ఐఆర్టీ పనులను కూడా నిలిపివేస్తామని ప్రకటించారు. మొత్తంగా వర్షాకాలం ప్రారంభానికి ముందే బల్దియా పాలన అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాలకు వరద ముంపు నివారణ చర్యలను ఎలా అధిగమిస్తారోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొన్నది.



సోమవారం సచివాలయం రోడ్డులో భారీగా కురుస్తున్న వర్షం

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లో వానలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం పలు చోట్ల తేలికపాటి వర్షం పడింది. గచ్చిబౌలిలో అత్యధికంగా 1.85, నాంపల్లిలో 1.65, మూసాపేటలో 1.60, హెచ్‌సీయూలో 1.58, కూకట్‌పల్లి బాలాజీనగర్, జీడిమెట్లలో 1.48, కూకట్‌పల్లి, జియాగూడ, పురానాపూల్‌లో 1.43, ఉప్పల్ బండ్లగూడ, హయత్‌నగర్, గాజులరామారంలో 1.40 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తనం ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. - సిటీబ్యూరో

# వాళ్లెవరో గుర్తించాలి

## బీఆర్‌ఎస్ నేతల కిడ్నాప్‌నకు యత్నం

బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

బీఆర్‌ఎస్ పీర్జాదిగూడ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు



ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం.. నిరసన తెలుపుతున్న పీర్జాదిగూడ బీఆర్‌ఎస్ నాయకులు

ఘట్‌కేసర్, మే 20: పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులను వెంటాడి, భయభ్రాంతులకు గురిచేసి..కిడ్నాప్‌నకు యత్నించిన వ్యక్తులను గుర్తించి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ పీర్జాదిగూడ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్‌రెడ్డి సోమవారం ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం మేయర్ వెంకట్‌రెడ్డి, మరికొందరు కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు సూర్యాపేట నుంచి శంషాబాద్‌లోని నోవా హోటల్‌కు వెళ్తున్న క్రమంలో ఘట్‌కేసర్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి అమర్‌సింగ్, టి. శ్రీధర్‌రెడ్డి, బి. నవీన్‌రెడ్డి, ఎం.చంద్రారెడ్డి, సీహెచ్. జగదీశ్వర్‌రెడ్డి, పి.అంజిరెడ్డి, కుర్ర శివకుమార్‌గౌడ్, సీహెచ్.నర్సింహారెడ్డి మరికొందరు దాదాపు పది కార్లలో వెంబడించి.. భయభ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులను వెంబడించి భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తుల్లో పీర్జాదిగూడ చెందిన కాంగ్రెస్ నాయకులు ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపారు. సీసీ టీవీ పుటేజీలను పరిశీలించి బీఆర్‌ఎస్ నాయకులను అపహరించేందుకు ప్రయత్నించిన వ్యక్తులను గుర్తించి.. చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదును పరిశీలించి.. చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు.